

చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు సూచించారు. నంగవరంలో అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం ఎంఎల్‌ఎ ఆనందరావు టివి, వంట పాత్రలు ఎలక్ట్రికల్ స్టౌలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మాజీ ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ తదితరులు పాల్గొన్నారు.



టివి అందజేస్తున్న ఎంఎల్‌ఎ ఆనందరావు

పొంచి ఉన్న వరద గండం

- బలహీనంగా ఏటిగట్లు
- గోదావరి ప్రవాహంతో మళ్లీ అగచాట్లు
- పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

ప్రజాశక్తి - రాజోలు

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 537 కిలోమీటర్ల మేర ఏటి గట్లు ఉన్నాయి. వరదొస్తే చాలు.. ఏటి గట్ల పొడవునా సమస్యలే. ఇవి బలహీనంగా ఉన్న ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసే పరిస్థితి. ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలే తప్ప శాశ్వత పరిష్కారం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్వహణ, పటిష్టతకు నిధులు కేటాయించలేదు. కొన్నింటికి టెండర్లు పిలిచినా బిల్లులు రావన్న భయంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. దీనికితోడు ఇసుక, మట్టి మాఫియా ఇష్టారాజ్యంగా ఏటిగట్లకు గట్టును ధ్వంసం చేస్తుండటం, రీచ్ కోసం బాటలు నిర్మించేందుకు యంత్రాలతో తొలిచేయడం వల్ల వరదల సమయంలో మరింత ముప్పుగా మారింది. గత ఏడాది ఇదే సమయంలో స్వయంగా ముఖ్యమంత్రి కోనసీమ ప్రజలకు హామీ ఇచ్చినా.. ఎక్కడా గంపెడు మట్టి వేసిన దాఖలాలు లేవు.



ఆధునికీకరణకు నోచుకోని రాజోలులో ఏటుగట్టు(ఫైల్)

ఏడాదిగా మారనితీరు..!

గత ఏడాది వరదలు సృష్టించిన భయానక పరిస్థితులు మర్చిపోకముందే మరలా గోదావరిలో ఎగువ నుండి వరద నీరు వచ్చి చేరడంతో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.2022 సంవత్సరంలో వచ్చిన వరదలు గత ముప్పై ఏళ్లలో ఎప్పుడూ చూడలేదని వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అంటున్నారు. కోనసీమలో ఏటిగట్టు బలహీనంగా ఉన్న 19 చోట్ల ఎక్కడో ఒక చోట గండి పోతుందని ప్రజలు ఆందోళన చెందారు . అదష్టవశాత్తూ ఎక్కడా గండి పడకపోయినా చాలా చోట్ల ఏటిగట్ల పైనుంచి వరద నీరు పొంగి పొర్లింది. రాజోలు మేకల పాలెం, నున్న వారి బాడవ, తాటిపాక మఠంలో ఏటిగట్టుకు సమాంతరంగా నీరు చేరి గట్టుపై నుండి ప్రవహించడంతో అత్యంత భయంకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసు, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, యువకులు ప్రాణాలకు తెగించి రాత్రింబవళ్ళు ఏటిగట్టు పైనే ఉండి కిలోమీటర్ల మేర ఇసుక, సిమెంట్ బస్తాలు వేసి రాజోలు దీవిని కాపాడ గలిగారు. వశిష్ఠ, గౌతమి నదీ పరీవాహక ప్రాంతాలైన మామిడికుదురు మండలం అప్పనపల్లి, బి.దొడ్డవరం ప్రాంతాలకు వెళ్లే కాజ్ వే పై అడుగున్నర ఎత్తులో వరద నీరు చేరడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పి. గన్నవరం, కాట్రేనికోన, రావులపాలెం, ఆత్రేయపురం, నాగులంక, చాకలి పాలెం, మలికిపురం, సఖినేటిపల్లి, ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితి నెలకొంది. నెమ్మదిగా గోదావరి శాంతించడంతో కోనసీమ ప్రాంత ప్రజలు వరదల నుండి బయటపడ్డారు. ప్రతి ఎటా వరదలు ప్రమాద స్థాయిలో వచ్చిన కరకట్టల పటిష్టత పై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని మండిపడుతున్నారు. ఈఏడాది కూడా భారీ స్థాయిలో వరదలు వేస్తే కరకట్టలు తట్టుకోవడం కష్టమేనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వరదలను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం

వరదలు ఎదుర్కొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాజోలు హెడ్ వర్క్స్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తాడి వెంకట లక్ష్మీనారాయణ మూర్తి తెలిపారు. ఏటిగట్టు పటిష్టత కోసం రూ.41.90 కోట్లు ప్రతిపాదనలు పంపామని అన్నారు. వశిష్ఠ గోదావరి పై అంతర్వేది,వైనతేయ గోదావరిపై లూటుకుర్రు, ఆదుర్రు, గోగన్న మఠం వద్ద మూడు అవుట్ పాల్ స్లూయిజ్ నిర్మాణాల కొరకు రూ.12.36 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఏటిగట్ట గట్టు బలహీనంగా ఉన్న వశిష్ఠ గోదావరి తీరంలో రాజోలు, పి.గన్నవరం, నాగులంక, చాకలి పాలెం, సఖినేటిపల్లి, అంతర్వేది, గొంది ప్రాంతాల్లో, వైనతేయ గోదావరి ప్రాంతంలో మానేపల్లి పెదపట్నం, పాశ్చర్లపూడి, బాడిలంక, ఆదుర్రు ప్రాంతాల్లో ఇసుకబస్తాలు, రక్షణ సామగ్రి సిద్ధం చేశామని అన్నారు.

వసతి గృహాల నిర్వహణను మెరుగు పరచాలి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

సాంఘిక వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీరును అన్ని విధాలుగా మెరుగుపరచాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంక్షేమ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎస్‌సి, బిసి సంక్షేమ అధికారులు, సంక్షేమ వసతి గృహ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్‌సి, బిసి సంక్షేమ వసతి గృహాలు గురుకులాలలో మరమ్మతులను, వసతులు కల్పన అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల ద్వారా 72 మరు గుదొడ్లను నిర్మిస్తారన్నారు. రుతుపవ నాలు సీజన్లో ఎటువంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీరు, పరిశుభ్రత అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల న్నారు. సంక్షేమ వసతి గృహాలలో బాలబాలికలు అనారోగ్యాలు పాలైతే అందుకు సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పరిశుభ్రత అనేది చాలా సెన్సిటివ్గా నిర్వహించాలని లేనిపక్షం లో వ్యాధులు ప్రభలే అవకాశం ప్రస్తుత సీజన్లో ఎక్కువగా ఉం టుందన్నారు. ఎస్‌సి, బిసి సంక్షేమ వసతి గృహాలలో ఖాళీలను నింపుతూ పూర్తి స్థాయిలో నిర్వహించే విధంగా ఐదు కి.మీ పైబడి రోజు బస్సులో ప్రయా ణిస్తున్న బాల బాలికలను గుర్తించి ఆయా వసతి గహా లలో చేర్పించే ఏర్పాట్లు చేయా లన్నారు. ఐసిఐసిఐ పూ డెన్షియల్ ఇన్సూరెన్స్ ద్వారా జిల్లాలో వసతి గృహాలకు అనుబంధంగా మ్యాపింగ్ చేస్తూ 31 ఎం ప్యానల్ ఆసుపత్రులను ఏర్పా టు చేయడం జరిగిందన్నారు. అనారోగ్య పరిస్థితుల్లో వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీవారిని సంప్రదించి అంబులెన్స్ లో సహా వైద్య సేవలను ఉచితంగా పొం దాలని సూచించారు. ఇటీవల అంబాజీపేట మండలానికి చెందిన ఒక విద్యార్థికి కిమ్స్ ఆస్పత్రిలో ఇన్సూ రెన్స్ ద్వారా వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. కాట్రేనికోన అమ లాపురం సంక్షేమ వసతి గృహాలలో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులను ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ద్వారా నిర్వహించు కోవా లని వసతి గృహ సంక్షేమ అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని పి.జ్యో తిలక్ష్మి దేవి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, విద్య సం క్షేమ ఇంజినీరింగ్ విభాగ డివిజనల్ ఇంజినీర్ సుబ్బ రాజు, వసతిగృహ సంక్షేమఅధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఆదాయం పెంపునకు కృషి



కండక్టర్, డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు అందజేత

ప్రజాశక్తి - రావులపాలెం

ఎపిఎస్ ఆర్‌టిసి ఆదాయం పెంచడంలో ఉద్యోగులు సమిష్టిగా కషి చేయాలని రావులపాలెం డిపో మేనేజర్ వైవివిఎన్.కుమార్ అన్నారు. రావులపాలెం డిపో పరిధిలో జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు డ్రైవర్లు, ముగ్గురు కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్ సిబ్బందికి శుక్రవారం డిపో వద్ద అభినందన సభ జరిగింది. అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు కె.కోటేశ్వరరావు, పి.ఆర్.రుక్మిణి, వి.ఎస్.ఆర్ మూర్తి, డ్రైవర్లు పి.ప్రకాష్ రావు, కె.మోహన్, ఎన్.సుబ్బారావులకు, ఉత్తమ శ్రామిక్, మెకానిక్ లకు కూడా ప్రశంసా పత్రాలు అందించారు. ఆషాడ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం అష్టదేవి దర్శనం కోసం రావులపాలెం డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపుతున్నామని డిపో మేనేజర్ వైవివిఎన్.కుమార్ తెలిపారు. వివరాలకు 995922 5537,7382 911871 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

రావులపాలెం ఆర్‌టిసి బస్ స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భవ దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రావుల సుబ్బారావు యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఎస్.రావు, జిపి.రావు, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన బిఎల్‌ఒల శిక్షణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలో బిఎల్‌ఒలకు కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్లో జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిసినట్లు తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో 62 మంది బిఎల్‌ఒలు ఉన్నారన్నారు. ఇందులో విఆర్‌ఒలు, సచివాలయంలోని వివిధ శాఖల అధికారులు ఉన్నారన్నారు. వారందరికీ రెండు రోజులపాటు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ముందుగా వారిలో 31 మందికి బుధవారం శిక్షణ ఇవ్వగా, మిగిలిన 31 మందికి శుక్రవారం శిక్షణకు హాజరైనట్లు ఆయన వివరించారు. అనంతరం అనుభవజ్ఞులైన శిక్షకులు జిఎస్.చక్రవర్తి, వైవివి.రమణ మాట్లాడుతూ బిఎల్‌ఒలు విధి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వివిధ ఫారాలను ఫుల్ ఫిల్ చేయడానికి అవసరమైన విధానాలను, వాటికి సంబంధించిన సర్టిఫికెట్ల సేకరణను వివరించారు. ఇదంతా వారికి ఆన్ స్క్రీన్ మీద వాక్యాల రూపంలో తెలియజేసి శిక్షణ పూర్తి చేశామన్నారు. వారందరికీ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులు అయినట్లుగా అర్హత పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో డిటి సుబ్బరాజు, ఆర్ఐ రమాయమ్మ, బి గుమస్తా సుబ్రహ్మణ్యం, సి గుమస్తా చిన్ని, బిఎల్వోలు పాల్గొన్నారు.



అర్హత పత్రాలు అందుకున్న బిఎల్‌ఒలతో అధికారులు

వికలాంగులకు మనోధైర్యాన్ని అందించాలి

ఉపకరణాల పంపిణీ చేసిన ఎంఎల్‌ఎ దేవవరప్రసాద్

ప్రజాశక్తి - రాజోలు

వికలాంగులకు చేసే గొప్పసాయం మనోధైర్యాన్ని అందించడమే అని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో దివ్యాంగులకు ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో)ద్వారా ఏర్పాటుచేసిన కత్రిమ ఉపకరణాలను ఎంఎల్ఎ వరప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గ పరిధిలో 385 మంది వికలాంగులకు సుమారు రూ.76 లక్షలతో 650 కత్రిమ ఉపకరణాలను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆలింకో భారత ప్రభుత్వంలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలోని వికలాంగుల సాధికారత సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కృత్రిమ అవయవాలు ఉపకరణాలు వాటి భాగాల లభ్యత, వినియోగం, సరఫరా పంపిణీని ప్రోత్సహిస్తుందన్నారు. ఆర్థోపెడిక్, దృష్టి, వినికిడి లోపం, మేధో వైకల్యం గల వికలాంగుల ఆరోగ్య సంరక్షణ కొరకు పరికరాలు వ్యక్తిగత రక్షణ కిట్లు ఉచితంగా అందిస్తుందన్నారు. వికలాంగుల రక్షణ సిబ్బంది, ఆసుపత్రులు ఇతర సంక్షేమ సంస్థలకు చేయూత నందిస్తుందన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు వికలాంగులకు తగిన శిక్షణ ఇస్తుందని, గత ఏడాది నవంబర్ లో ఆలింకో సంస్థ వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగత్వ లోపాలను శాస్త్రీయపరంగా గుర్తించి అర్హులైన వారికి కృత్రిమ అవయవాలు పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో బాగంగా రాజోలు నియోజకవర్గానికి రూ.76.33 లక్షలు వెచ్చించినట్లు వివరించారు. బ్యాటరీ ఆపరేటర్ మోటార్ సైకిల్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు , నడక కర్రలు , అత్యధిక డిజిటల్ వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలింకో సంస్థ డైరక్టర్ నివాద్, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనువాస్, వైస్ ఎంపిపిలు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, జనసేన రాష్ట్ర నాయకులు దిరిశాల బాలాజీ, టిడిపి పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు బోళ్ల వెంకటరమణ, టిడిపి అదికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, బోళ్ల సతీష్, తాడి మోహన్, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి పలువురు పాల్గొన్నారు.



ట్రైసైకిల్ అందజేస్తున్న రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

పిఎసిఎస్‌ల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మండపేట

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పిఎసిఎస్) అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావుఅన్నారు. శుక్రవారం మండపేట మండలం ఏడిద,చెల్లూరు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఛైర్మన్‌లుగా నియమితులైన దేవళ్ళ వెంకటరావు, గొడవర్తి సత్యనారాయణ లు మండపేట టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ జోగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పిఎసిఎస్ చైర్మన్ లు, మెంబర్లు గా నియమితులైన వారిని ఎంఎల్ఎ వేగుళ్ళ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సంధర్బంగా ఎంఎల్ఎ మాట్లాడు తూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి మీయొక్క సహాయ సహకారాలు అందించాలన్నారు. చెల్లూరు పిఎసిఎస్ మెంబర్లుగా మేడిశెట్టి నాగేశ్వరరావు, తలాటం వెంకటేష్, ఏడిద పిఎసిఎస్ మెంబర్లుగా ఇందుకూరి శ్రీనివాసరాజు, పైన సుబ్బయ్య నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రిమ్మలపూడి వేణుగోపాలదొర, చిరట్ల అప్పారావు, కాదా ప్రభాకరరావు, పర్వతిన వీర్రాజు, కొలుపోటి సత్యనారాయణమూర్తి, పెనుమత్స వెంకటవర్మ రాజు, పదం ఆనంద్, గుడాల కోటబాబు, తదితరులు పాల్గొన్నారు.



పిఎసిఎస్ ఛైర్మన్‌లను సత్కరిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల



మొక్కలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

తల్లి పేరుతో ఇంటివద్ద ఒక మొక్క నాటి దానిని పూర్తిగా విద్యార్థుల సంరక్షించాలని పామర్రు గ్రీన్ కోర్ సమన్వయకర్త ఆలీ అన్నారు. శుక్రవారం కె.గంగవరం మండలంలో పామర్రు హైస్కూల్ ఆవరణలో విద్యార్థుల కు మొక్కలు పంపిణీ చేశారు .ప్రధానో పాధ్యాయుడు ఎర్ర ఈశ్వరుడు మాట్లాడు తూ పర్యావరణాన్ని పరి రక్షించాలంటే మొక్కలు పెంపకం ఒకటే మార్గమని అన్నారు. ఈ మొక్కలను బాగా పెంచి పోషించేటప్పుడు నాలుగు సంవత్స రాలు తర్వాత వారికి బహుమతి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది కార్యదర్శులు ఉపాధ్యాయులు కెవి.రామా రెడ్డి ఆర్.మాలిని తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పరిశీలన

ప్రజాశక్తి- కొత్తపేట

పలివెల మీడియం డ్రెయిన్ (కౌశిక డ్రెయిన్) నందు జరుగుతున్న పూడికతీత పనులను శుక్రవారం ఆర్‌డిఒ శ్రీకర్ పరిశీలించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ కాలనీ వంతెన వద్ద కౌశిక డ్రెయిన్ శుభ్రం చేసి గట్టుకు ఇరువైపులా ఉంచిన మురుగును, మట్టి దిబ్బలను, వ్యర్థాలను తక్షణమే తీసివేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా, పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు డ్రెయిన్‌పై ఉన్న ఆక్రమణలను గుర్తించి జాబితా తయారు చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించినారు. కళా నగర్, బియస్‌యన్‌ల్ ఆఫీసు, గోగివారిపేట నందు చేసిన పూడిక తీత పనులను పరిశీలించారు. ఇక్కడ పూర్తిస్థాయిలో పనులు జరగటం లేదని .కొన్ని చోట్ల ఉన్న మురుగు, గుర్రపుడెక్కలు, మట్టి దిబ్బలని వెంటనే తొలగించే విధముగా మండల స్థాయి లో అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దార్ వై.రాంబాబు, ఎంపిడిఒ పి.నరేష్ కుమార్, ఎఇ (డ్రెయిన్స్) జెయల్.నాగరాజు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీకర్

ఆలమూరు ఎఎంసి పాలకవర్గం నియామకం

అధ్యక్షులుగా కొత్తపల్లి వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన పాలకవర్గం గౌరవాధ్యక్షులుగా కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు వ్యవహరించనున్నారు. ఆలమూరు ఎఎంసిని కూటమి ప్రభుత్వం జనసేన పార్టీకి కేటాయించడంతో మడికి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు కొత్తపల్లి వెంకటలక్ష్మిని ఛైర్‌పర్సన్‌గా, ఆలమూరు టిడిపి నాయకుడు కేతా రాంబాబు ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా ఆకుల రామాంజనేయులు, చింతలపూడి శ్రీనివాస్ కుమార్, దూలం మంగ లక్ష్మి, గాదె మంగా, కాలా సత్యవేణి, కొమ్ము దేవి, నామాల సూర్యనారాయణ మూర్తి, రాయుడు నాగరామ దుర్గ, టేకుమూడి సీతారామలక్ష్మి, తోరాటి సత్య కిషోర్, వెత్సా సుబ్బారావు, గుత్తుల నాగేశ్వరరావు, దండే శ్రీదేవి నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా మోదుకూరు పిఎసిఎస్ అధ్యక్షుడు, ఆలమూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, ఆలమూరు సర్పంచ్, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ ఆఫీసర్ లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎసి పాలకవర్గం నియమాకంపై పలువుఉ హర్షం వ్యక్తం చేశారు.



కొత్తపల్లి వెంకటలక్ష్మి

పింఛను కోసం వృద్ధురాలి ఎదురుచూపు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ఆత్రేయపురం శివారు నరసన్నపేటకు చెందిన డబ్బైఐదేళ్ల వయసు గల మల్లాడి సత్యవతి పింఛన్ ఇప్పించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. భర్త పోతురాజు (90) మంచానికి పరిమితమై ఇటీవల 3 నెలల క్రితం మృతి చెందాడు. భర్తకు వచ్చే పింఛన్‌తో ఇరువురూ కాలం గడిపేవారు. పోతురాజు సత్యవతి దంపతులకు ఒక కుమార్తె తన భర్తతో భద్రాచలం ఉంటోంది. గతంలో భర్త పెన్షన్ పొందుతూ చనిపోతే భర్త పెన్షన్ ఐడితో భార్యకు వెంటనే పింఛని చ్చేవారు. కానీ కొద్ది నెలలుగా ఈ పింఛన్ లు నిలుపుదల చేయడంతో వృద్ధురాలు పింఛన్ కోసం ఎదురుచూస్తుంది.




సత్యవతి

ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి - కొత్తపేట

కూటమి నాయకులు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. కొత్తపేట శిల్పాశ్రమంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాలూరి సత్యానందం పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖ శిల్పి రాజకుమార్ వడియార్, ఖండవల్లి అంజిబాబు, వారాహి మాత శివాజీ, బకోటిపల్లి సుబ్రహ్మణ్యం, కొమరాజులంక రిటైర్డ్ ఇఒ కృష్ణ మనోహర్ కు గురువులుగా చిరుసత్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో గొలకోటి వెంకటేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, భమిడిపాటి లక్ష్మీనారాయణ, రుద్రరాజు ప్రసాద్ రాజు,పాలాటి మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



జనాభా నియంత్రణపై అవగాహన



అమలాపురంలో ప్రచార బ్యానర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు కళాశాలల్లో జనాభా నియంత్రణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

అమలాపురం: ప్రపంచవ్యాప్తంగా జనాభా కు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడిం చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్‌ఒ భరత్ లక్ష్మి, డిఐఒ.సత్యనారాయణ, ఐసిడిఎస్ పిడి శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** జనాభా వృద్ధి వల్ల కలిగే ఆవశ్యత వనరుల లభ్యతపై వైద్యాధికారులు డాక్టర్ కె. సత్యవతి, డాక్టర్ జాన్ లెవీ అవగాహన కల్పించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరం, లూటు కుర్రు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీలను నిర్వహించారు ఈ కార్యక్రమంలోఏ ఎన్ ఎమ్ లు, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తపేట:** స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎకనామిక్స్, జువాలజీ డిపార్ట్మెంట్ల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పి. రాజు అధ్యక్షతన విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.రమాదేవి, ఐ క్యూ ఎసి కోఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు. కామర్స్ హెచ్‌ఒ డి డాక్టర్ కె.సత్యనారాయణ, జువాలజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ డా..రామకృష్ణ , ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ హెడ్ బి.రవికుమార్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంను పురస్కరించుకుని విద్యార్థులు పోస్టర్ ప్రజెంట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మజ, ఎకనామిక్స్ లెక్చరర్ సుదర్శన్, డాక్టర్ రమణ, డాక్టర్ లక్ష్మ అధ్యాపకులు ,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆలమూరు:** పెదపళ్ళ, చొప్పెల్ల పిహెచ్‌సిల పరిధిలో వైద్యాధికారులు ఎన్.లక్ష్మీ స్నేహ, డి.సాయికిషోర్, బి.అనంత రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీలను నిర్వహించి జనాభా వద్ధి వల్ల కలిగే ఆవశ్యకతను, వనరుల లభ్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆయుష్మాన్ మందిరాల్లో ఎంఎల్‌హెపీల ఆధ్వర్యంలో ప్రపంచ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపిహెచ్ఇఒ కె.జ్యోతికుమార్. హెచ్ఇఒలు ఎవివి.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ పి.రాజా రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముమ్మిడివరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పిలుపునిచ్చింది.నగర పంచాయతీ పరిధిలోని ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభాదినోత్సవం సందర్భంగా ఆరోగ్య కేంద్రం నుండి నగర పంచాయతి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలినుద్దేశించి సూపర్వైజర్ సంపూర్ణ మాట్లాడుతూ జనాభా నియంత్రణలో పాటించాల్సిన దీర్ఘ కాలిక మరియు స్వల్ప కాలిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మీరా సాహెబ్ రవీంద్ర, ఫార్మసిస్ట్ సత్యనారాయణ ఏఎన్ఎమ్ లు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో విద్యార్థులకు బహుమతుల అందజేత



చొప్పెల్లలో ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మరణం

ప్రజాశక్తి -దేవరపల్లి, గోపాలపురం

దేవరపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం వేళ్ళచింతలగూడెం గ్రామానికి చెందిన మందపాటి రాజేష్ (25) గొల్లగూడెంలో మెయిన్ రోడ్ పక్కన కరెంటు స్తంభానికి నిచ్చెన వేసుకొని కేబుల్ వర్క్ చేస్తున్నాడు. ఈ సమయంలో 11కెవి వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. తండ్రి మందపాటి చంటియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజేష్ మృతి వార్తతో తల్లిదండ్రులు బోరున రోదిస్తున్నారు. వారిని సముదాయించడం ఎవరితరమూ కావట్లేదు. ఎదిగొచ్చిన కొడుక లేడనే నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. త్వరలోనే వివాహం చేద్దామనుకునే సరికి ఇలా జరగడంతో దుఃఖ:సాగరంలో మునిగిపోయారు.

రాజేష్ మృతి బాధాకరం : ఎంఎల్ఎ మద్దిపాటి

రాజేష్ అకాల మృతి బాధాకరమని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. రాజేష్ భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళు లర్పించారు. మతుడికి టిడిపి సభ్యత్వం ఉండడంతో రూ.5 లక్షల బీమా అందిస్తామని తెలిపారు. కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం సింగవరం గ్రామంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన వీరమాచి పోసియ్యకు చెందిన ఇంటిలో గ్యాస్ బండ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డి పాకను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న కాసు బంగారు మంగళ సూత్రాలు, రూ. 30 వేల నగదు, ఫ్రిజ్, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధితులకు తక్షణ సాయంగా బియ్యం అందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు సుందరమ్మ చెరువుగట్టుకు చెందిన దీపాటి మణి రావు (38) మృతి పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మణిరావు గురువారం తాపీ పనికి వెళ్ళి రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. శుక్రవారం ఉదయం ఇంటి బయట శవమై కనిపించాడు. మృతుడు స్వస్థలం మలికిపురం మండలం లక్కవరం. ఉపాధి రీత్యా దుబాయ్ దేశం వెళ్లి ఏడాది క్రితం తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రాజోలులో అత్తవారి ఇంటి వద్ద ఉంటూ అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు లక్కవరం వెళు తుంటాడు. రోజు మాదిరిగానే పని నుంచి రాత్రి ఇంటికితిరిగి వచ్చిన అతను తెల్లవారే సరికి ఇంటి బయట మతి చెంది ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య దీపాటి స్వర్ణ లత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేలు ముందు తాగి వ్యక్తి మరణం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పేలు ముందు తాగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు ఇబిసి కాలనీలో నివాసముండే మాగిరెడ్డి పాండవులు (49) తన ఇంటి వద్ద మద్యం ఎక్కువగా తాగాడు. తరువాత మద్యం మత్తులో పేలు మందు కలుపుకుని తాగాడు. వెంటనే భార్య చూసి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పాండవులుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జోనల్ స్కూల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం అండర్ 14 బాలుర విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సుమారు 8 పాఠశాలల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు సెక్రటరీ కొప్పనాతి భాస్కర్ తెలిపారు. ఈ పోటీలలో మహాత్మా గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానంలో రీజెన్సీ పబ్లిక్ స్కూల్, తృతీయ స్థానంలో గిరియంపేట హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారన్నారు.

రహదారుల నిర్మాణాలపై అవగాహన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ రహదారుల నిర్మాణాలపై చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కాకినాడ ఉప ప్రణాళిఖాధికారి సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2026 ఆర్థిక సంవత్సరం నుంచి డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని తిరుమాలి, లింగంపర్తి, సి.రాయవరం, ఏలేశ్వరం మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రోడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అభ్యంతరాలు ఏమైనా ఉంటే సంబంధిత రైతులు తమకు తెలియజేయాలన్నారు. రానున్న పదేళ్ల లోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సదస్సులో శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్ బాబు, మసిరపు నాగేశ్వరరావు, కమిషనర్ ఎం.సత్యనారాయణ, సహాయ ప్లానింగ్ అధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు.

సురక్షితమైన తాగునీటిని అందించాలి

ప్రజాశక్తి - అమలాపురం

రుతుపవనాలు, వర్షాలు నేపథ్యంలో పైప్ లైన్లు లీకేజీలు కలుషిత నీటి సరఫరా పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ అన్ని విధాల ప్రజలకు సురక్షితమైన త్రాగు నీటిని సమృద్ధిగా అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ గ్రామీ ణ నీటి సరఫరా పారిశుధ్య విభాగ ఇంజినీర్లను ఆదేశిం చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ రకాలుగా పైప్ లైన్లు లీకేజీ మూలంగా కలుషిత తాగు నీరు సరఫరా చేయ కుండా మెలకువలు, కీటక జనత వ్యాధులు నియం త్రణ చర్యలు, సంక్షేమ వసతి గృహాలలో మరుగు దొడ్ల నిర్మాణం అంశాల పురోగతిపై సమీక్షించారు. . ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సిహెచ్ ఎన్‌వి. కృష్ణారెడ్డి, డివిజనల్ ఇంజినీర్లు రాంప్రసాద్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారికి చేయించుకున్నవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ఆర్.మహేష్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం లింగ నిర్ధారణ నిషేధత చట్టం - 1994 అమలుపై జిల్లా స్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహాకమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ ఎం.దుర్గా రావు దొర, అదనపు డిఎం హెచ్ఒ, భరత లక్ష్మి, అదనపు జిల్లా ఎస్‌పి ప్రసాద్, డిఐ ఒ.సత్య నారాయణ, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, డిఐ పిఆర్ఒ సిహెచ్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నా రు.

కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - రాజోలు



పథకాలను వివరిస్తున్న ఎంఎల్‌సి రాజశేఖర్

సిఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని ఎంఎల్‌సి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్ పిలుపునిచ్చారు. రాజోలు మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఎంఎల్‌సి రాజశేఖర్ ప్రారంభించారు. రాజోలు వాసవి కల్యాణ మండపంలో మండల పరిధిలోని బూత్ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమం అనంతరం రాజోలు పట్టణంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, టిడిపి మీడియా కోఆర్డినేటర్ బోళ్ళ సతీష్ బాబు, టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జి బత్తుల రాము, టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోళ్ళ వెంకటరమణ, రాజోలు పట్టణ టిడిపి అధ్యక్షులు పామర్తి రమణ, కార్యదర్శి నార్కెడమిల్లి విష్ణు, మామిడికుదురు మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికే అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమానికి, అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో బలవరెడ్డి సత్తిబాబు,మేక శివప్రసాద్, జగ్గంశెట్టి సత్యనారాయణ,మేక ప్రసాద్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, పర్వతిన మురళీకృష్ణ తదితరులు,పాల్గొన్నారు. **మండపేట:** మండపేట మండలం, ఏడిద సీతానగరం, పాలతోడు, వెలతోడు, మెర్నిపాడు గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు.

జగదీష్‌కు రాష్ట్ర దేవాంగ సభ్యుని పరామర్శ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆధ్వర్యంలో జగ్గన్నపేటకు చెందిన రాష్ట్ర కార్యదర్శి కొండ జగదీష్ అనారోగ్యంగా వున్న విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జగదీష్‌ను స్వగృహంలో పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో కార్యదర్శి బల్ల వెంకటేశ్వర రావు, చేనేత విభాగం అధ్యక్షులు పిచ్చుక శ్యామ్, కొనసీమ దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల వరదరాజులు తదితరులు ఉన్నారు.

పెరిగిన వరద నీటి ప్రవాహం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు కోటిపల్లి వద్ద గోదావరి నది లో వరద నీరు ప్రవాహం పెరగడంతో ముందస్తుగా కోటిపల్లి రేవులో అధికారులు పడవ ప్రయాణాలు నిలిపివేశారు. రెవెన్యూ అధికారుల గోదావరి పరివాహ క ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో లంకలలో కూరగాయలు అపరాల పంటలు నీట మునిగాయి. **కపిలేశ్వరపురం:** గోదావరి వరద ఉధృతిని తహశీల్దార్ జి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి శుక్రవారం పుష్కర ఘాట్ వద్ద పరిస్థితిని సమీక్షించారు. ప్రస్తుతం కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి, పుష్కర ఘాట్లకు వరదనీరు చేరింది. లంక గ్రామాల్లో వరద పరిస్థితిని శ్రీనివాసు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.



కోటిపల్లి రేవు వద్ద గోదావరి

జూనియర్ కళాశాల శిథిల భవనాల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిల భవనాలను కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్ శుక్రవారం పరిశీలించారు. కళాశాలలో కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రిన్సిపల్ రూమ్, తరగతి గదులను ఆయన పరిశీలించారు. కళాశాల స్థితిపై తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజు, కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి సురేష్ రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కళాశాల స్థితిగతులను పరిశీలించడం జరిగిందని, సదరు అంశాలన్నీ కలెక్టర్ కు నివేదిక రూపంలో అందజేయనున్నట్లు ఆర్‌డిఒ తెలిపారు.

వికలాంగులకు రూ.15 వేల పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆలమూరు

అర్హులైన వికలాంగులకు రూ.15 వేలు పెన్షన్ అందించాలని పారా స్వచ్ఛంద సంస్థ ల్యాంప్ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బయమ్మ, సిబిఆర్ కోఆర్డినేటర్ బి.మహిమారావు అన్నారు. వారి ఆధ్వర్యంలో మండలంలోని పినపల్ల గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ సంగీత సుభాష్ అధ్యక్షతన వికలాంగుల హక్కుల సంక్షేమ పథకాలు వారి సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించి, భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ ఎఎంసి చైర్మన్ వక్కపట్ల లక్ష్మణావు, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రభుత్వం మహిళల చేయూత కోసం నిర్వహిస్తున్న మండల కేంద్రంలోని ఉచిత కుట్టు శిక్షణ(టైలరింగ్) కేంద్రాన్ని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులు నిర్వహించే లీడర్లకు పలు సలహాలు, సూచనలు అందజేసి విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే శిక్షణలో పాల్గొనే మహిళలు పూర్తి స్థాయిలో నేర్చుకోవాలని అలాగే హాజరు శాతాన్ని పరిశీలించి 70 శాతం హాజరు తప్పక ఉండాలని, లేనిపక్షంలో వారికి లబ్ధి చేకూరదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా ప్రెసిడెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

డ్వాక్రా సొమ్ము స్వాహా చేసిన గౌతమ్ మహిళా శక్తి సంఘం ప్రెసిడెంట్ పరమట శారదపై చర్యలు తీసుకోవాలని సమనస ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్, తాలూకా ఎస్‌ఐలకు డ్వాక్రా మహిళలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వన్నె చింతలపూడి గ్రామానికి చెందిన గౌతమ్ మహిళా శక్తి సంఘం ప్రెసిడెంట్ పరమట శారద గ్రూప్ సభ్యులు అప్పు, పొదుపు కట్టమని ఇచ్చినటువంటి డబ్బులను సుమారు రూ.1.76 లక్షలు అవినీతికి పాల్పడిందని వాటిని చెల్లించమని అడిగితే మీకు కట్టేది లేదని గ్రూపు మహిళలపై శారద తిరగబడింది. దీంతో స్థానిక ఎస్‌బిఐ మేనేజర్, అమలాపురం తాలూకా స్టేషన్ ఎస్‌ఐ సభ్యులు కట్టినటువంటి అప్పు వివరాలు పరిశీలించారు. సుమారు రూ.1.76 లక్షలు శారద వాడుకున్నట్టు నిర్ధారణలో తేలిందని సభ్యులు తెలిపారు.సర్పంచ్ సమక్షంలో పలుమార్లు తగువు పెట్టగా రూ.లక్ష చెల్లించిందని, 2024 అక్టోబర్ నాటి నుంచి బ్యాంకు వడ్డీతో సహా అప్పు చెల్లిస్తానని గ్రూపు సభ్యులకు భార్యా భర్తలిద్దరూ పరమట శారద, బాలరాజు రాతపూర్వకంగా రాసి ఇచ్చారని తెలిపారు. పోలీసులు, బ్యాంకు వారు కలగజేసుకొని న్యాయం చేయాలని సభ్యులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రూపు సెక్రటరీ బిరుదుగంటి వెంకాయమ్మ, గ్రూపు సభ్యులు కారెం సత్యవతి, పరమట రామలక్ష్మి, చుట్టుగుళ్ళ కనకదుర్గ, చుట్టుగుళ్ళ మరియమ్మ తదితరులు ఉన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి శుక్రవారం రావులపాలెం గ్రామానికి చెందిన కంకటాల సూర్యనారాయణ భారతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ డిసి నల్లం సూర్య చక్రధరరావుకు అందజేశారు.

యాత్రికుల సౌకర్యాలకే ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా సౌకర్యవంతమైన దర్శనం కలిగేలా ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో యాత్రికుల సూచనలను, సలహాలను తీసుకునేందుకు, వారి సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ ఇఒ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి యాత్రికులు. ఫోన్ ద్వారా కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

తణుకుకు చెందిన రామడుగుల సూర్యనారాయణ, వెంకట సత్య సూర్య రమాదేవి, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం అప్పనపల్లి బాల బాలాజీ స్వామివారి దర్శించి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు రూ 10, 116 విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. చిఎంఎ లక్ష్మీ ప్రసన్న పుట్టినరోజు పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 24న పది మంది యాత్రికులకు అన్నప్రసాద వితరణ జరిపించాలని కోరారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామచంద్రపురం డిఎల్‌డిఒ, మండల ప్రత్యేక అధికారి వి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కపిలేశ్వరపురం గ్రామంలో ఇంటింటా తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తలను పంచాయతీ సిబ్బంది సేకరించడాన్ని ఆమె ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి ఆర్.మోహన్, కార్యదర్శి కె.శివచక్రవర్తితో కలిసి పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. పారిశుధ్య ప్రక్రియ ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని కార్యదర్శి శివచక్రవర్తి కి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ అధ్యక్షుల నియామకంపై ఉత్తర్వులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా నియోజక వర్గపరిధిలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పిఎసిఎస్) అధ్యక్షులను నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ నుంచి ఆయా సొసైటీలకు ఉత్తర్వులు అందాయి. నియోజకవర్గం లో మొత్తం 18 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అధ్యక్షులు నియమించారు. ప్రమాణ స్వీకారాలకు కూటమి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా అమ్మవారి జాతర

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక జాతీయ రహదారిపై వేంచేసి ఉన్న ధనలక్ష్మి అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. జాతరను తిలకించడానికి అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

కూ టమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ వైసిపి బలోపేతానికి కృషి జరపాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ కోరారు. ఎస్.యానం కు చెందిన ఎంపిటిసిల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు ను వైసిపి మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉపాధ్యక్షుడిగా నియామకం చెందిన అప్పారావు ను డాక్టర్ శ్రీకాంత్ దుశ్శాలువా కప్పి సత్కరించారు.అ లాగే వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే శ్రీను ఆధ్వర్యంలో ఎస్.యానాంకు చెందిన టిడిపి కార్యకర్త బర్రె జలబంధి రాజు వైసిపి లో చేరారు. రాజుకు డాక్టర్ శ్రీకాంత్ వైసిపి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, నాయకులు రేవు రాజేష్, ముత్తాబత్తుల సురేష్,అంబటి శ్రీను,లంకే చిరంజీవి,ముదే దుర్గ బాబు,దారా చినబాబు,పాము వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బిఎల్ఒలకు శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్నికల బూతు లెవెల్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ జాతీయ శిక్షణా కార్యక్రమం ఓటర్ నమోదు అధికారి నెం. 48 మండపేట నియోజకవర్గ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఆర్‌ఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణలో న్యూఢిల్లీ వెళ్లి శిక్షణ పొంది వచ్చిన నాగం నాగ శివ, (వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఏడిద సచివాలయం) ఓట్లు నమోదు, మార్పులు చేర్పులు, తదితర అంశాలపై ఎన్నికల బూతు లెవెల్ అధికారులకుశిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ ఓటరు నమోదు అధికారి తహశీల్దార్ జి.శ్రీనివాస్, సహాయ ఓటరు నమోదు అధికారి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పిఎ మెహర్ బాబా, డిటి జానకి రామయ్య, వై శ్రీనివాస్, వి దేవేంద్ర కుమార్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, 166 నుంచి 210 వరకు ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారులు, పాల్గొన్నారు.

13న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని తామరపల్లి గ్రామంలో ఈనెల 13న ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ తోకల మంగా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు. ఊపిరితిత్తు లు, గుండె, తదితర అన్ని వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని అన్నారు. ప్రజ లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.